సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సదానంద్

లిబర్టీ: జనరంజకమైన ప్రజాపాలన అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద్ అభినందించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం ఉద్యోగాలు భర్తీ చేయడం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నందుకుగాను ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించారు. దాదాపు పది నెలల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేసి దాదాపు 40 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఈ సందర్భంగా సదానంద్ అన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తున్నారని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత ప్రగతి అభివృద్ధి సాధించాలని ఆయన అన్నారు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి: జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్

పంజగుట్ట: ప్రతీ ఒక్కరూ ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్ అన్నారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సంఘాల చైర్మన్ బి.కేశవులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రంధి భవాని ప్రసాద్ మాట్లాడుతూ చట్టాలు ఎన్నో వస్తున్నాయని కానీ ప్రజలు వాటిని సంపూర్ణంగా వినియోగించుకోవడం లేదన్నారు. లోకాయుక్త అనే వ్యవస్థ రాష్ట్రంలో ఉందని చాలా మందికి తెలియకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ మంగబాబు, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, న్యాయవాది డి.ఎల్. పాండు, కన్నెబోయిన ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల పందిరి వాహనంపై శ్రీవారు


ముత్యాల పందిరి వాహనంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివారిని ముత్యపు పందిరి వాహనంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష పూజలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ళు, కళాకారుల ఆట, పాటలతో స్వామివారి రథయాత్ర ఊరేగింపు ఆలయం నుంచి శ్రీనగర్ కాలనీ వీధులగుండా సాగింది.

బస్తీ దవాఖానాల్లో సకల సౌకర్యాలు కల్పించాలి

మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్


వైద్యులతో మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): పేదవారిని వైద్యాన్ని అందించే బస్తీ దవాఖానాల్లో అన్ని సౌకార్యాలు ఉండాలని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. ఈ మేరకు బోరబండ పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానాల్లో వస తుల లేమి, సిబ్బంది కొరత లాంటి సమస్యలపై నివేదికలు రూపొందిస్తే, తాను సమస్యను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా దృష్ట్యా మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇకపై ప్రతి నెల సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డా. మమత, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ అనురాధ, డాక్టర్ సుభాన్, డాక్టర్ దివ్యతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా తిరువీధి రథోత్సవం

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తిరువీధి రథోత్సవం వైభవంగా జరిగింది. సన్నాయి మేళాల నడుమ స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు ఉత్సాహాన్ని కనబరిచారు.

అనుమానాస్పదస్థితిలో నగల దుకాణం మేనేజర్ అదృశ్యం


సుకేతు షా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని శ్రీకృష్ణా జ్యువెలర్స్‌లో గత ఆరు సంవత్సరాలుగా మేనేజర్‌గా పని చేస్తున్న సుకేతు షా (29) అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని మిథిలానగర్ బుర్జు బంజారా అపార్ట్‌మెంట్‌లో నివసించే సుకేతు షా శ్రీకృష్ణా జ్యువెలర్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 30వ తేదీన ఎప్పటిలాగానే విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చాడు. అయితే ఈ నెల 1న ఉదయం 6.20 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఫోన్‌ను ఇంట్లోనే వదిలేసి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు కూడా రాకపోవడంతో తన భర్త కనిపించడం లేదంటూ శృతి షా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో భర్త రాసిపెట్టిన ఓ లెటర్ దొరికిందని, అందులో గత ఐదు రోజుల నుంచి తీవ్రంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నానని, వర్క్ ప్లేస్‌లో డబ్బుల కోసం ఒత్తిడి పెరుగుతుందని రాశాడు. ఇదే విషయాన్ని అయన ఫోన్‌లో వీడియో కూడా రికార్డు చేసి పెట్టాడని, శ్రీకృష్ణా జ్యువెలర్స్ యజమానిపై అనుమానం ఉందని, వారి వేధింపులు తట్టుకోలేకనే తన భర్త అదృశ్యమయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బంజారాహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని సుకేతు షా కోసం గాలిస్తున్నారు.

మానసిక దివ్యాంగులకు ధైర్యాన్ని ఇవ్వాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్


హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్‌ని ఘనంగా సన్మానిస్తున్న ఆసుపత్రి వైద్యులు

శ్రీనగర్‌కాలనీ: మనో రోగ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని, వారికి మనోధైర్యాన్ని అందించాలని తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో వరల్డ్ మెంటల్ హైల్త్ డేని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మానసిక దివ్యాంగులు కాకుండా ఉండటానికి మానసిక ప్రశాంతత అవసరమని, ఎక్కువ ఒత్తిళ్ళకు గురువ్వకూడదని, ఆత్మవిశ్వాసం, మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఫోరెన్సిక్, మహిళా క్లోజ్డ్ వార్డులను డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, తెలంగాణా స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ పంచాక్షరి, వెస్ట్‌జోన్ ఏసీపీ వెంకటరమణతో కలిసి సందర్శించి అక్కడి సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుజోయ్ పాల్‌ని ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిత రాయిరాల, డాక్టర్ సుధారాణి, డాక్టర్ పద్మజ, డాక్టర్ వివాశ్వన్, డాక్టర్ ఫణికాంత్, డాక్టర్ ఓమేష్, డాక్టర్ రఘువీర్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



నేత్రపర్వంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- మైదానాలు, కాలనీలు, అపార్టుమెంట్ల వద్ద ఆడిపాడిన మహిళలు
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. ఫిలింనగర్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎన్టీటీ నగర్‌లో జరిగిన వేడుకల్లో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొని బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొలనులో బతకమ్మలను నిమజ్జనం చేశారు. - బంజారాహిల్స్


బంజారాహిల్స్ గౌరీశంకర్ నగర్ బస్తీలో..


బతుకమ్మ వేడుకల్లో దానం నాగేందర్



బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో..






ఫిలింనగర్ పద్మాలయ అంబేద్కర్ నగర్ బస్తీలో..



ఉదయ నగర్ బస్తీలో..


ఎన్టీటీ నగర్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

రతన్ టాటా సేవలు స్ఫూర్తిదాయకం

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప

లక్డీకాపూల్ : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమందిస్తున్న నిమ్స్‌కు పారిశ్రామికవేత్త రతన్ టాటాకు దగ్గర పోలిక ఉందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. రతన్ టాటా మృతి పట్ల గురువారం ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్న ఘనత నిమ్స్ ఆస్పత్రిదన్నారు. అదే విధంగా పేదల కల నెరవేర్చే దిశగా 86 శాతం నష్టాలు వస్తున్నప్పటికీ నానో కార్లను అందించిన మహనీయుడు రతన్ టాటా అని కొనియాడారు. అంతే కాకుండా దేశ ప్రయోజనాల కోసం ఆయన స్ఫూర్తిదాయకమైన రీతిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచారని డాక్టర్ బీరప్ప శ్లాఘించారు. ఆ మహనీయుడి ఆశయాల మేరకు పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడంలో నిమ్స్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

డ్రైనేజీ సమస్యలపై పర్యటన



ఫిలింనగర్: ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు గురువారం స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై వాటర్‌వర్క్స్ మేనేజర్ రాంబాబుతో కలిసి పర్యటించారు. గౌతమ్‌నగర్, జైల్‌సింగ్‌నగర్, బీజేఆర్‌నగర్, దుర్గా భవానీనగర్, ఎంఆర్‌సీకాలనీ తదితర బస్తీల్లో పర్యటించి అక్కడి సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే చేపట్టాల్సిన పనుల వివరాలను సేకరించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు డ్రైనేజీ సమస్యలపై పర్యటించడం జరిగిందని, సమస్యలను వాటర్‌వర్క్స్ అధికారులకు నేరుగా వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నగేష్‌సాగర్, అబ్దుల్‌గని, కాటూరి రమేష్, బొప్పవరపు వేణు, ముత్యాల శ్రీనివాస్‌నాయుడు, ఆవుల రాజన్న, పద్మ, గోపి, శ్రీను తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే పనులు మొదలుపెడతామని ఈ సందర్భంగా వాటర్‌వర్క్స్ అధికారులు స్పష్టం చేశారు.

మంత్రి దామోదర నర్సింహకు ఆహ్వానం


దామోదర రాజనర్సింహకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న శ్రావణి

కాచిగూడ: కూకట్‌పల్లిలో ఈ నెల 12వ తేదీన శ్రావణి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ 2వ బ్రాంచిని ప్రారంభించనున్నట్లు హాస్పిటల్ సీఈవో డాక్టర్ శ్రావణి చెట్టుపల్లి తెలిపారు. హాస్పిటల్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయంలో దామోదర రాజనర్సింహను గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ నవీన్ చెట్టుపల్లి, ఎండి డాక్టర్ హరీష్ తరిగొప్పుల తదితరులు పాల్గొన్నారు.

'దాస్' మూవీ ట్రైలర్ లాంచ్


ట్రైలర్ లాంచ్ ఆవిష్కరణలో పాల్గొన్న సినీ బృందం

బంజారాహిల్స్: ఫైన్ ఆర్ట్స్ కాలేజీ యంగ్ గ్రాడ్యుయేట్స్ కలిసి రూపొందించిన దాస్ మూవీ ట్రైలర్ లాంచ్ కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సినీ బృందం, టెక్నీషియన్లు, దర్శకుడు, నటీ నటులు సినిమా విశేషాలను పంచుకోవడంతో పాటు సినిమా ట్రైలర్‌ను, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సినీ రచయిత, దర్శకుడు మంజూర్ మాట్లాడుతూ నిజమైన ప్రేమ, కమర్షియల్ రిలేషన్‌షిప్స్ మీద ఈ సినిమా సాగినట్లు తెలిపారు. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నటులు ఉదయ్ రాజీవ్‌సింగ్, నటి ఐషా దివాన్షి, శునయ, నిర్మాత అహ్మద్, మ్యూజిక్ డైరెక్టర్ శాంతాను గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఆధ్యాత్మిక శోభ

- భక్తిశ్రద్ధలతో దసరా వేడుకలు
- సెక్యూరిటీ కార్యాలయం వద్ద అన్నదాన వితరణ


అన్నదాన కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ హేమంత్ తదితరులు

లక్డీకాపూల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిమ్స్‌లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గురువారం సెక్యూరిటీ కార్యాలయంలో సెక్యూరిటీ అధికారి రామారావు ఆధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ హేమంత్, సెక్యూరిటీ మాజీ అధికారి ఉమేష్, ఏఎస్ఐ సుబ్బారావు, సామాజిక సేవా కార్యకర్త లక్ష్మీ నారాయణలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలోని డెంటల్ విభాగం, నిమ్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా దుర్గామాతకు ప్రత్యేక పూజలు జరిగాయి. అంతే కాకుండా నిమ్స్ డైరెక్టర్ పేషీలో కూడా దుర్గా దేవికి విశేష పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో పలువురు రోగులు, వారి సహాయకులు కూడా పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన

ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా.కళ్యాణ్ నాయక్


సభ్యత్వ నమోదులో కళ్యాణ్ నాయక్

రహమత్‌నగర్ (బోరబండ): బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సామాన్య ప్రజానీకం నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా.కళ్యాణ్ నాయక్ తెలిపారు. బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బర్మవత్ రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో గురు వారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ ప్రధానిమోదీ చేపడ్తున్న ప్రజాసంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులవుతున్న ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకుంటున్నారన్నారు. హైద్రాబాద్ నగరంలో ఎస్టీ మోర్చాను మరింత బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. మహిళా మోర్చా నాయకురాలు జ్యోతి నాయక్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, కృష్ణమోహన్‌తో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

పంజగుట్ట: జనాభాలో అధికశాతం ఉన్న ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనకబడి ఉండగా రిజర్వేషన్లతో విద్యా, ఉద్యోగ అవకాశాలు కూడా కోల్పోవాల్సి వస్తుందని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు అల్లా దుర్గం సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఉద్యోగ నియామకాల్లో, మెడికల్ కౌన్సెలింగ్‌లో బీసీ డీ గ్రూప్‌లో ఉన్న ముదిరాజ్ పిల్లలకు 60 మార్కులు వచ్చినా అర్హులు కాలేకపోయ్యారని అదే అగ్రవర్ణాల వారు 40 మార్కులు వచ్చినా అర్హులు అయ్యారని ఈ విషయాలు అన్ని బీసీ కమిషన్‌కు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి బాలుగారి నర్సింహులు, గౌరవాధ్యక్షులు ఎడ్ల బాబురావు, తోట సంజయ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల స్థితిగతులు చూసిన నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చారని కానీ కొంతమంది కక్ష్యపూరితంగా కోర్టును ఆశ్రయించి దాన్ని ఆపారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మారుస్తానని హామీ ఇచ్చిందని కాని అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు దానిపై ఎలాంటి కార్యాచరణ తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రమేష్, కుమారస్వామి, ఉదయ్ కుమార్, మధుసుధన్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


శ్రీ దుర్గా దేవిగా బంజారాహిల్స్ కనకదుర్గా దేవి అమ్మవారు


దుర్గా దేవిగా దైవసన్నిదానం రాజరాజేశ్వరి దేవి అమ్మవారు


దుర్గా దేవిగా మాగంటి కాలనీ దుర్గా దేవి అమ్మవారు


దుర్గా దేవిగా శ్రీనగర్ కాలనీ భ్రమరాంబికా దేవి అమ్మవారు


శ్రీసీతారామస్వామి దేవాలయంలో శ్రీదుర్గాదేవిగా పర్వతవర్ధిని


దుర్గామాత విగ్రహం ముందు బతుకమ్మలు ఉంచి పూజలు నిర్వహిస్తున్న మహిళలు ..


దుర్గాదేవి అలంకారంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

మహా కనకదుర్గా.. విజయ కనకదుర్గా..!

- వైభవంగా కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


వెంకటేశ్వరనగర్ బస్తీలో దాండియా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: దేవీ నవరాత్రి ఉత్సవాలు 8వ రోజైన గురువారం ఆలయాల్లో, మండపాల వద్ద వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారి శ్రీ దుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకటేశ్వరనగర్ బస్తీలో అమ్మవారి మండపం వద్ద ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ పాల్గొన్నారు. మాగంటి కాలనీ విజయ కనకదుర్గా దేవి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గాదేవీగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

బంజారాహిల్స్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి గురువారం భక్తులకు దుర్గాదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను పూజిస్తే శత్రు పీడనం తొలగిపోతుందని భక్తులు విశ్వసిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. పంచ ప్రకృతి రూపాల్లో మొదటి దుర్గా రూపమని తెలిపారు. దుర్గా మాత అలంకారంలో ఉన్న అమ్మవారిని పూజిస్తే సర్వత్రా విజయం ప్రాప్తిస్తుందని అర్చకులు తెలిపారు.


ఎస్పీఆర్‌హిల్స్‌లోని ఇందిరానగర్ ఫేజ్2లో పూజలు నిర్వహిస్తున్న సీఎన్ రెడ్డి